ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

చిక్కడపల్లి: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడిని ఖండిస్తూ రాయాస్ వెల్ఫేర్ అసోసియేషన్, వివేక్‌నగర్ అసోసియేషన్‌ల నిర్వాహకులు టి.గోపాల్ ఆధ్వర్యంలో ఆదివారం భారత జాతీయ జెండాలను పట్టుకుని యాత్రికులపై దాడి చేసిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేస్తూ వివేక్‌నగర్ నుంచి చిక్కడపల్లి మెయిన్‌రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు.
– జమ్మూకశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో మరణించిన పర్యాటకులకు నివాళిగా ఆదివారం రాత్రి డివిజన్‌లోని వై జంక్షన్ సమీపంలో గాంధీనగర్‌వాసులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేశభక్తులు, సంఘ సేవకులు టి.దామోదర్‌రెడ్డి, బి.గణపతి, విజయ్‌రావు, నిరంజన్, రమణ, సందీప్, ఎన్.రమేష్, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.


వివేక్‌నగర్‌లో జరిగిన ర్యాలీలో స్థానికులు, కార్మికులు


గాంధీనగర్‌లో వై జంక్షన్‌లో కొవ్వొత్తుల ర్యాలీ



ఉగ్రదాడిలో మృతులకు అశ్రునివాళి

నల్లకుంట: కశ్మీర్ పహల్గాంలో ఉగ్రదాడిని ఖండిస్తూ.. అసువులు బాసిన పర్యాటకులకు అశ్రు నివాళులర్పిస్తూ ఓయూ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అసోసియేషన్ సభ్యులు సాదేనేని నవీన్, పోకల నాగేందర్, బ్రహ్మచారి, కొంకటి సత్యనారాయణ, సుధాకర్, శివప్రకాశ్, సురేంద్ర రావు, రామరాజు, ఆనంద్, చంద్రశేఖర్, రవికుమార్ బట్టర్ తదితరులు పాల్గొన్నారు.

అవసరమైతే పాకిస్తాన్‌పై యుద్ధం చేయాలి



కవాడిగూడ: కశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మారేడు మోహన్ పిలుపునిచ్చారు. ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి, ఐక్య దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాకిస్తాన్, ఉగ్రవాదులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేసి పాకిస్తాన్ జెండాను దహనం చేశారు. అవసరమైతే పాకిస్తాన్‌పై యుద్ధం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా యావత్ దళిత సమాజం అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు డాక్టర్ వంశతిలక్, మారేడు మోహన్, నాయకులు అరవింద్, అరుణ్, వినోద్, మల్లేష్, మహేష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని బీఎస్ఎన్ఎల్ హైద్రాబాద్ పీజీఎం టీఎస్ రామకృష్ణ, పీపీజీఎం ఎం.చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సరోజిని క్రికెట్‌గ్రౌండ్‌లో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. తొమ్మిది టీమ్‌లు పాల్గొనగా రోలింగ్ టైగర్ టీమ్ విజయం సాధించింది. విజేత టీమ్‌కు వారు ట్రోఫీని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... ఉద్యోగులు నిత్యం తమ విధుల్లో బిజీగా ఉంటారని వారిలో ఉత్తేజం నింపడం కోసం ఇలాంటి ఈ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజా రాంమోహన్, ఆర్.పవనమూర్తి, చంద్రమౌళి, దుర్గప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పురస్కారాల ప్రదానోత్సవం

చిక్కడపల్లి: సాంస్కృతిక సంస్థ రసమయి ఆధ్వర్యంలో సాంస్కృతిక రంగ ప్రముఖులకు ఈనెల 28న పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు ఎంకే రాము తెలిపారు. ఈ కార్యక్రమం త్యాగరాయ గానసభలో సోమవారం సాయంత్రం 5.30గంటలకు ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు.

ఈపీడీసీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా శ్రీదేవిరాజేశ్వరి



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఈపీడీసీ) జాతీయ ఉపాధ్యక్షరాలుగా వి.శ్రీదేవిరాజేశ్వరి నియమితులయ్యారు. తన నియమకానికి సహకరించిన సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రంగయ్య, ఏపీ కన్వీనర్ గిద్దా శ్రీనివాస నాయుడుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

రేవంత్‌రెడ్డి హయాంలోనే తెలంగాణ అభివృద్ధి

లిబర్టీ: రాష్ట్ర ప్రగతికి ప్రభుత్వం బాటలు వేస్తుందని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, జాతీయ ప్రధాన కార్యదర్శి వెన్న సదానందు అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక దేశాలు మొగ్గు చూపుతున్నాయన్నారు. ఆదివారం తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జపాన్ పర్యటనతో ఎన్నో పరిశ్రమలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇందులో భాగంగా పలు కంపెనీలు ఒప్పందాలు సైతం చేసుకున్నాయన్నారు. ఫోర్త్ సిటీలో సంస్థలను ఏర్పాటు చేయడం మంచి పరిణామం అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు.

పూలే, అంబేడ్కర్ ఆధునిక భారత నిర్మాతలు


కేవీపీఎస్ సదస్సులో మాట్లాడుతున్న జేబీ రాజు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పూలే, అంబేడ్కర్‌లు ఆధునిక భారత నిర్మాతలని అంబేడ్కర్‌వాది జేబీ రాజు అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో పూలే, అంబేడ్కర్ జన జాతర సభ జరిగింది. ఈ సందర్భంగా జేబీ రాజు మాట్లాడుతూ... మహాత్మా జ్యోతిరావుపూలే, అంబేడ్కర్‌లు తమ తుదిశ్వాస వరకు మనువాదానికి వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించారని అన్నారు. వారు చూపిన మార్గంలో నేటితరం మనువాదంపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కేవీపీఎస్ నగర అధ్యక్షుడు ఎం.దశరథ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు, ఎం. కృపాసాగర్, బాలపీరు, సుబ్బారావు, రేణుక తదితరులు పాల్గొన్నారు.

సీఎం సార్.. మా సమస్య వినండి

- రేపు సీఎం పర్యటన నేపథ్యంలో గుంతల రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు
- ఏడేళ్లుగా ఫ్లైఓవర్ నిర్మాణంతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- అంబర్‌పేట ఫ్లైఓవర్ సర్వీసు రోడ్డు పూర్తయ్యేలా చూడాలని సీఎంకు స్థానికుల వినతి


శ్రీరమణ చౌరస్తాలో తాత్కాలికంగా మట్టితో చదును చేసి రోడ్డు

అంబర్‌పేట: ఏడు సంవత్సరాలు... నాలుగు ఎన్నికలు ముగిసినా అంబర్‌పేట ఫ్లైఓవర్ నేటికి పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులో రాలేదు. నిత్యం వేలాది మంది ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. కాగా ఈ నెల 29న అంబర్‌పేటలో రాష్ట్ర సీఎం కార్యక్రమం ఉండడంతో ఫ్లైఓవర్ సమస్యపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. ఫ్లైఓవర్ సర్వీసు రోడ్డును అధికారులు కంటి తుడుపు చర్యగా గంతల రోడ్లలో మట్టి పోసి చదును చేస్తున్నారు. అంబర్‌పేట ఫ్లైఓవర్ కింద శ్రీరమణ చౌరస్తాలో మాజీ ఎంపీ వి.హనుమంతారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మిత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు సీఎం పర్యటన ఖరారయ్యింది. దీంతో అధికారులు అధ్వానంగా ఉన్న ఫ్లైఓవర్ కింద రోడ్లను నామమాత్రంగా యుద్ధప్రతిపాదికన మరమ్మతులు చేస్తున్నారు. సీఎం పర్యటన ప్రాంతాలైన ఛేనంబరు చౌరస్తా, శ్రీరమణ చౌరస్తాల్లో తాత్కాలిక మరమ్మతులను అధికార యంత్రాంగం ముమ్మరంగా చేపట్టింది. దీంతో సీఎం పర్యటన పుణ్యమా అని ఈ రెండు చౌరస్తాలను మరమ్మతులు చేశారు.

ఇది అసలు సమస్య...

అంబర్‌పేట ఫ్లైఓవర్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు మీ వల్లే జాప్యం అంటే మీ వల్లే జాప్యం అంటూ ఆరోపణలు చేసుకుంటున్నారే తప్ప ఎవరికి వారు బాధ్యతమభాద్యత తెలుసుకుని పని పూర్తి చేయడం లేదు. 1.5 కిలో మీటర్ల మేరు నిర్మించిన ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయి దానిపై నుంచి వాహనాలు కూడా వెళ్తున్నాయి. కింద సర్వీసు రోడ్డు మాత్రం ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. కొన్ని సున్నిత అంశాలు ముడిపడి ఉన్నాయని సాకు చెపుతూ ఎవరికి వారు తప్పించుకుంటున్నారు. ఏకంగా రాష్ట్ర సీఎం అంబర్‌పేట ఫ్లైఓవర్ కింద నిర్వహిస్తున్న కార్యక్రమానికి రానుండడంతో దీనిపై ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సీఎం పర్యటనతో గుంతలు పూడుస్తున్న అధికారులు మిగత పనులు కూడ చేసేలా స్థానిక నేతలు సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.


శ్రీరమణ చౌరస్తాలో గుంతలను పూడ్చిన అధికారులు

‘పహల్గాం దాడి తలచుకుంటే

రక్తం మరుగుతోంది’

- ప్రధాని నరేంద్ర మోదీ
- నల్లకుంటలో మన్‌కీ బాత్ వీక్షణ

నల్లకుంట: ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గందమల్ల ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం నల్లకుంటలో భారత ప్రధాని నరేంద్ర మోదీ మన్ కీ బాత్ 121వ ఎపిసోడ్ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఈనెల 22న పహల్గాం ఉగ్రదాడిని గురించే ప్రధాని మోదీ ప్రసంగించారు. ఉగ్రదాడి ఘటన చిత్రాలను చూస్తుంటే ప్రతి భారతీయుడి రక్తం మరిగిపోతోందన్నారు. దేశంలోని ప్రతి పౌరుడు ఆ బాధ అనుభవిస్తున్నారని అన్నారు. ఈ దాడిని పిరికిపందల చర్యగా ప్రధాని అభివర్ణించారు. ఈ దాడిలో తమ ఆత్మీయులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు పీఎం మోదీ ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

◆ ఉగ్రదాడి తర్వాత ప్రపంచం నలుమూలల నుంచి నిరంతరం సంతాప సందేశాలు వెల్లువెత్తుతున్నాయన్నారు. ప్రపంచ నాయకులు కూడా ఆయనకు ఫోన్ చేశారని.. లేఖలు రాశారని, సందేశాలు కూడా పంపించారని చెప్పారు. ఈ దారుణమైన ఉగ్రవాద దాడిని అందరూ తీవ్రంగా ఖండించారని, మృతుల కుటుంబాలకు వారు సంతాపం తెలిపారన్నారు. ఉగ్రవాదంపై మన పోరాటంలో 140 కోట్ల మంది భారతీయులకు ప్రపంచం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.


నల్లకుంటలో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

◆ నేను మరోసారి హామీ ఇస్తున్న ఈ దాడికి పాల్పడిన వారిపైనా., కుట్రదారులపైనా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉగ్రదాడిలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. డివిజన్ పరిధిలోని టీఆర్టీ కాలనీలోని ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎస్. నర్సింగ్‌రావు నివాసంలో ఈ కార్యక్రమాన్ని కార్పొరేటర్ అమృత, బీజేపీ రాష్ట్ర నాయకులు నాయిని బుచ్చిరెడ్డి, కె. గోవర్ధన్ రెడ్డి, ఓబీసీ మోర్చా కన్వీనర్ వెంకటేష్, కార్యనిర్వాహక సభ్యుడు మధుసూదన్, యాదగిరి, ప్రశాంత్ జోషి, బి. ప్రశాంత్, వై. శివ కుమార్, టి. దిగంబర్, ఏ. సుమేష్ కుమార్, ప్రవీణ్ తదితరులు వీక్షించారు.

కర్రిగుట్టపై కేంద్రం నరమేధాన్ని ఆపాలి



ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో నిరసన నిర్వహిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు, కార్యకర్తలు

ముషీరాబాద్: కర్రిగుట్ట ప్రాంతంలో సుమారు 10వేల మంది పోలీసులు చుట్టుముట్టి బాంబులు వేస్తూ చేస్తున్న నరమేధాన్ని వెంటనే ఆపి వేయాలని సీపీఐఎంఎల్ కేంద్ర నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య డిమాండ్ చేశారు. పోలీసుల చర్యలను నిరసిస్తూ ఆర్‌టీసీ క్రాస్‌రోడ్స్‌లో న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. హెలికాప్టర్స్, డ్రోన్‌ల ద్వారా వేలాది మంది సాయుధ పోలీస్ బలగాలు అక్కడ తిష్ట వేశాయన్నారు. ప్రతి రోజు ఎన్‌కౌంటర్లు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ సర్కార్ అత్యంత పాశవికంగా వ్యవహరిస్తూ కార్పొరేట్ రంగానికి అడవులను అప్పజెప్పడం కోసం ఆపరేషన్ కగార్‌ను తలపెట్టిందన్నారు. వెంటనే కేంద్రం మావోయిస్టులతో శాంతి చర్చలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధులు జేవీ చలపతిరావు, సాదినేని వెంకటేశ్వర్‌రావు, ఝాన్సీ, కె.గోవర్ధన్, వి.సంధ్య, బి.ప్రదీప్, ఎం.శ్రీనివాస్, అరుణ, అనురాధ, శివబాబు, మహేష్, శ్రీకాంత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


ముత్యాలమ్మను దర్శించుకుంటున్న వినయ్‌కుమార్

చిక్కడపల్లి: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కల్గిస్తాయని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ అన్నారు. ఆంధ్రాకేఫ్ సమీపంలోని ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో బీజేపీ నేత వినయ్‌కుమార్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసింది. ఈ కార్యక్రమంలో మాలబస్తీ అధ్యక్షుడు జీఎస్ మధుసూదన్, ఉపాధ్యక్షుడు మదన్ మోహన్, సంయుక్త కార్యదర్శి జి.విజయ్‌కుమార్, నేతలు అరుణ్‌కుమార్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు చెల్లించకుంటే తిరుగుబాటు తప్పదు’

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: ఫీజు బకాయిలు చెల్లించకుంటే ప్రభుత్వంపై విద్యార్థుల తిరుగుబాటు తప్పదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. మూడేళ్లగా ఫీజుల బకాయిలు చెల్లించనందుకు నిరసనగా ఈనెల 28వ తేదీ నుంచి జరగాల్సిన కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ తదితర పరీక్షలను రెండోసారి వాయిదా వేశారని ఆయన పేర్కొన్నారు. అలాగే మహాత్మాగాంధీ యూనివర్సిటీ డిగ్రీ విద్యార్థుల పరీక్షలు నిరవధికంగా వాయిదా వేశారని ఆయన తెలిపారు. ఫీజుల బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో పరీక్షలు బహిష్కరిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక కాంట్రాక్టర్‌కు చెల్లించే డబ్బుతో 14 లక్షల మంది విద్యార్థుల ఫీజులు చెల్లించవచ్చన్నారు.

భక్తులకు అన్నదానం

చిక్కడపల్లి: ఆర్యవైశ్య సంఘం గాంధీనగర్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని వీవీ గిరినగర్ శ్రీఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైశ్య హాస్టల్, వాసవీ హాస్పిటల్స్ చైర్మన్ కొత్తూరు సీతయ్య గుప్తా, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ అతిథులుగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లంపేట రమేష్, ప్రముఖులు విశ్వనాథం, నాగభూషణం, మహేష్, రిక్తేశ్వర్, మురళీ కృష్ణ, శ్రీనివాస్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.


వీవీగిరినగర్ ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో అన్నదానం చేస్తున్న సీతయ్యగుప్తా


సుందరయ్య పార్కులో డాక్టర్ రవితేజరెడ్డిని సన్మానిస్తున్న వాకర్స్

మోకాలి నొప్పి నివారణపై సదస్సు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: యువకులు, వృద్ధుల్లో మోకాలి నొప్పికి కారణాలు, నివారణ అనే అంశంపై ఆదివారం సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. అపోలో ఆస్పత్రి ఆర్థోపెడిక్ సర్జన్ డా. కె.రవితేజరెడ్డి పలు అంశాలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పీవీ నిరంజన్‌రెడ్డి, అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, వి.నాగభూషణం, దామోదర్‌రెడ్డి, శైలజ మోహన్, ఎస్.రమేష్‌రెడ్డి, అంబటి శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సునీల్, కోశాధికారి దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా ట్రస్మా అధ్యక్షుడిగాభీష్మారెడ్డి

కవాడిగూడ: ట్రస్మా ఆధ్వర్యంలో దోమలగూడలోని ఓ హోటల్‌లో ఆదివారం రంగారెడ్డి జిల్లాస్థాయి ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా గాయం భీష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి.వెంకటరమణ, కోశాధికారిగా ఎండీ రఫీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు ప్రైవేట్ స్కూల్స్ ఎదుగుదలకు కృషి చేస్తానని ప్రమాణస్వీకారం చేశారు. ఈ ఎన్నికలకు ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, కోశాధికారి శ్రీకాంత్‌రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ కె.రామేశ్వర్‌రెడ్డి, రంగారెడ్డి డిస్ట్రిక్ అసోసియేట్ ప్రెసిడెంట్ ఎ.యాదగిరి, శేరిలింగంపల్లి మండల్ అధ్యక్షుడు మారోజు ఆచార్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌శంకర్, కోశాధికారి రెహమాన్ తదితరులు హాజరయ్యారు.


రంగారెడ్డి జిల్లా ట్రస్మా నూతన కమిటీ సభ్యులు

మహిళా రచయితలను ప్రోత్సహిస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రొ. వింధ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హస్మిత ప్రచురణల ద్వారా మహిళా రచయితలను ప్రోత్సహించడానికి తమ వంతుగా కృషి చేస్తున్నాం అని రిటైర్డ్ ప్రొఫెసర్ డా. యూ.వింధ్య అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైద్రాబాద్ ఉమెన్స్ రైటర్స్ ఫోరం, వృత్తి సంఘాల సౌజన్యంతో సుమారు 53 మంది మహిళా రచయితలు రచించిన ‘యోధ’కథ సంకలనం విజయోత్సవ సభ, శ్రామిక మహిళా అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. 2023లో స్వయం సిద్ధ, 2024లో ఒంటరి మహిళ జీవితంపై యోధ, 2025లో మహిళలు శ్రమశక్తి కథల సంకలనం చేశారు. ప్రముఖ రచయిత బండారు విజయ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గిరిజ, ఈ ఎస్ ఆశలత,వి.సంధ్య, డాక్టర్ వీవీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్‌లో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్


బాగ్‌అంబర్‌పేటలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


రజతోత్సవానికి గులాబీ దళం

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం వరంగల్‌లోని ఎల్కతుర్తిలో రజతోత్సవ సభను నిర్వహించారు. ఈ సభకు ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో సభకు తరలివెళ్లారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆయన కుమారుడు ముఠా జైసింహల నేతృత్వంలో ఆరు డివిజన్‌ల నుంచి సుమారు వంద బస్సుల్లో, సుమారు 200 కార్లల్లో తరలివెళ్లారు. అంతకు ముందు ప్రతి బస్తీలో ప్రధాన కూడళ్లల్లో బీఆర్ఎస్ పార్టీ జెండాలను ఎగరవేశారు. రాంనగర్ చౌరస్తాలోని అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. బాగ్‌అంబర్‌పేటలో జెండా ఆవిష్కరణకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పార్టీ జెండాను కార్పొరేటర్ పద్మావెంకట్ రెడ్డితో కలిసి ఎగురవేశారు. అలాగే గోల్నాక డివిజన్‌లో కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ డివిజన్‌లో పార్టీ జెండా ఆవిష్కరించి సభకు తరలారు. అంబర్‌పేట డివిజన్‌లో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ జెండా ఆవిష్కరించారు. అలీకేఫ్ చౌరస్తాలో సభకు తరలివెళ్లే బస్సులకు మాజీ మంత్రి మహమూద్ అలీ జెండా ఊపి ప్రారంభించారు. బీఆర్ఎస్ సీనియర్ నేత భీమగోని కృష్ణాగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడ డివిజన్ జమాల్‌బస్తీలో పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు ఎర్ర భీష్మదేవ్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, ఎల్.రమేష్, రాజేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

– ముషీరాబాద్/అంబర్‌పేట జోన్ బృందం


కాచిగూడలో జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, భీమగోని కృష్ణాగౌడ్


అలీకేఫ్ చౌరస్తాలో సభకు బయల్దేరే వారితో మాజీ మంత్రి మహమూద్ అలీ


రాంనగర్ చౌరస్తాలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న బీఎస్ఆర్


అడిక్‌మెట్ డివిజన్ అచ్యుత్‌రెడ్డి మార్గ్‌లో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తున్న మహిళా నాయకులు